క్లుప్తంగా

సమ్మెటివ్-2 పరీక్షలు ప్రారంభం

కంబాలచెరువు: నగరంలో సమ్మెటివ్-2 పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ సందర్శించారు. ఒకటి నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులకు క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ 3 విధానంలో జవాబులు ఓఎమ్ఆర్ షీట్‌లలో గుర్తించాల్సి ఉంటుందన్నారు. తొమ్మిదో తరగతికి మాత్రం పదో తరగతి పరీక్షల మాదిరిగా సమ్మెటివ్-2 నిర్వహిస్తామన్నారు. పరీక్ష ఉన్న రోజుల్లో ఉదయం 7 గంటలకు ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్ట్రాంగ్ రూమ్ నుంచి హెచ్‌ఎంలు ప్రశ్నపత్రాల బండిల్స్‌ను తీసుకోవాలన్నారు. పరీక్ష 11 గంటల వరకూ నిర్వహించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి పంపించాలన్నారు. ఉపాధ్యాయులు 12.30 గంటలకు ముఖ హాజరు వేయాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం ఎమ్‌వీఎమ్ సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఒకరికి కోవిడ్

కడియం: స్థానిక కామిశెట్టివారి వీధి సమీపంలో నివాసం ఉండే ఓ మహిళకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇటీవల ఆరోగ్యం బాగోలేకపోవడంతో హెల్త్ చెకప్ నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆమె వెళ్లింది. అక్కడ పరీక్షల్లో కోవిడ్‌గా తేలింది. దీంతో సదరు మహిళ ఇంటి చుట్టూ పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. పరిసరాల్లో జ్వర సర్వే నిర్వహించి, ఎవరికీ జ్వరాలు లేవని గుర్తించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

సీటీఆర్ఐ: జిల్లాలో రబీ సీజన్‌లో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, గురువారం నాటికి 811 మంది రైతుల నుంచి 7,018 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని జేసీ తేజ్‌భరత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2012 మంది రైతుల నుంచి 15,861 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు కూపన్లను జనరేట్ చేశామన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



ముస్లింలకు కిట్లు పంపిణీ చేస్తున్న కంటిపూడి బాలకృష్ణ తదితరులు

కడియం: రంజాన్‌ను పురస్కరించుకుని దుళ్లకు చెందిన 30 ముస్లిం కుటుంబాలకు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కంటిపూడి కిరణ్‌కుమార్ రూ.15 వేల విలువైన కిట్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ మేరకు దుళ్ల మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్ తండ్రి, రిటైర్డ్ టీచర్ బాలకృష్ణ చేతుల మీదుగా గోధుమ, చక్కెర, నెయ్యి, సేమియా తదితర వస్తువులతో కూడిన ఈ కిట్‌లను అందజేశారు. ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఈదర నందేశ్వరరావు, చిట్టూరి వెంకన్నచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సీతానగరం: స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన ట్రై ఓ డెంట్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు అయ్యల జయభారతి, సీహెచ్ హర్ష, ఎ.సుబ్రహ్మణ్యం, సత్యం రమేష్‌బాబు 62 మందికి దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కస్తూర్బా గాంధీ ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, అయ్యల గోపి, అయ్యల గణేష్, ఎస్.రామకృష్ణ, కొండాటి సత్యనారాయణ, యన్నమని వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగను పంపిణీ చేస్తున్న ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాదరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక మోరంపూడి ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఎల్ఐసీ ఉద్యోగులు, స్వర్ణాంధ్ర సేవా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మేనేజర్లు ఎ.నాగేంద్రకుమార్, బీఎస్ఎన్ మూర్తి, ఉద్యోగుల సంఘం నాయకులు సతీష్ ప్రయాగ, కోదండరామ్, గుబ్బల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఊబిరాడక..

- మృత్యు కుహరాల్లా ఇసుక తిన్నెలు
- సరదాగా స్నానాలకు దిగి అనంతలోకాలకు..
- పదేళ్లలో 50 మంది వరకూ మృత్యువాత



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ దిగువన ప్రమాదకర ఇసుక తిన్నెలు

ధవళేశ్వరం: గలగల పారే గోదారి సవ్వడులు.. చల్లని గాలులు.. రా రమ్మని పిలిచే ఇసుక తిన్నెలు.. వీటిని చూస్తే మది మురవక మానదు. కాసేపు ఎవరికైనా అక్కడ సేద తీరాలని అనిపించక మానదు.. అదే కొందరిని మృత్యు కుహరంలోకి లాగేస్తోంది.. అనంత లోకాలకు తీసుకుపోతోంది.. ఆహ్లాదాన్ని కాస్త ఆవిరి చేస్తోంది.. కన్నవారికి కడుపు కోతను మిగుల్చుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇసుక తిన్నెల వద్ద పరిస్థితి ఇది. సరదాగా స్నానాలకు దిగి అనేక మంది దొంగ ఊబుల్లో చిక్కుకుని మృతి చెందుతున్నారు. వేసవి ముదురుతోంది.. విద్యాలయాలకు సెలవులూ వచ్చేస్తున్నాయి.. సమీప గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన అనేక మంది కాటన్ బ్యారేజీని చూసేందుకు వస్తుంటారు. వేసవి కాలం కావడంతో గోదావరిలో నీటి ప్రవాహం తగ్గి బ్యారేజీ దిగువ భాగంలో ఇసుక తిన్నెలు పైకి తేలాయి. ఆ ఇసుక తిన్నెలు సాయంత్రం వేళ సేద తీరేందుకు కాటన్ బ్యారేజీకి వచ్చేవారిని ఆకర్షిస్తున్నాయి. దీంతో గేటు దూకి లేక ఇతర మార్గాల ద్వారా ఇసుక తిన్నెల్లోకి వెళ్లి కొంతసేపు సేద తీరుతున్నారు. అక్కడితో ఆగకుండా ఇసుక మధ్యలో ఉన్న గోదావరి నీటిలో స్నానానికి దిగి దొంగ ఊబుల్లో చిక్కుకుంటున్నారు. అక్కడ లోతు తెలియకుండా స్నానానికి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

మార్గాన్ని మూసివేసినా..

గడిచిన పదేళ్ల కాలంలో కాటన్ బ్యారేజీ దిగువన స్నానానికి దిగి సుమారు 50 మందికి పైనే మృత్యువాత పడ్డారు. ఇందులో ముఖ్యంగా 20 ఏళ్ల లోపు యువకులే కావడం గమనార్హం. ఇది ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు బ్యారేజీ దిగువన దొంగ ఊబులు ఉన్నాయని హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అదేవిధంగా తూర్పు డెల్టా లాక్ నుంచి బ్యారేజీ దిగువకు వెళ్లే మార్గాన్ని సైతం మూసివేశారు. అయినప్పటికీ వీటిని పట్టించుకోని యువకులు కిందకు దిగి మృత్యువాత పడుతున్నారు.

వద్దన్నా వినడం లేదు..

కాటన్ బ్యారేజీని చూసేందుకు వచ్చే పర్యాటకులు, స్థానికులు దిగువన ఉన్న దొంగ ఊబులు పట్ల జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఇసుక తిన్నెల్లో ప్రమాదకర ఊబులు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. అయితే పలువురు వీటిని ఖాతరు చేయకుండా ఒక్కో సందర్భంలో ఇరిగేషన్ సిబ్బందితో సైతం వాగ్వాదానికి దిగి కిందకు వెళుతున్నారు. ప్రతి ఏడాది ఈ ఇసుక తిన్నెల్లో అనేక మంది మృత్యువాత పడడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు సూచిస్తున్నారు.



ఇసుక తిన్నెల్లోకి వెళ్లకుండా ఏర్పాటు చేసిన గేటు, హెచ్చరిక బోర్డు

హద్దు మీరితే ఉపేక్షించం

బ్యారేజీ దిగువకు స్నానానికి వెళ్లడం ప్రమాదకరం. అక్కడ ఇసుక తిన్నెల్లో దొంగ ఊబులు ఉన్నాయని హెచ్చరిక బోర్డులను సైతం ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బంది బ్యారేజీపై సాయంత్రం వేళల్లో గస్తీ తిరుగుతున్నారు. హద్దు మీరి బ్యారేజీ దిగువకు స్నానానికి దిగితే ఉపేక్షించేది లేదు.

–కె.మంగాదేవి, సీఐ, ధవళేశ్వరం



దాడికి గురైన విద్యార్థికి పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీహరి సాయి ప్రసాద్‌ను పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజానగరం జిల్లా పరిషత్ హైస్కూల్లో తోటి విద్యార్థి చేతిలో దాడికి గురై స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెంకే శ్రీహరి సాయిప్రసాద్‌ను వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి గురువారం పరామర్శించారు. తరగతి గదిలో సప్లమెంటరీ పరీక్ష రాస్తున్న శ్రీహరి సాయిప్రసాద్‌పై తొమ్మిదో తరగతి విద్యార్థి తనతో తెచ్చుకున్న చాకుతో అందరూ చూస్తుండగానే దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జరిగిన సంఘటనపై ఆరా తీశారని, రాజా అందుబాటులో లేకపోవడంతో బాలుడికి జరుగుతున్న వైద్యం పరిశీలించేందుకు ఆసుపత్రికి వచ్చానని విజయలక్ష్మి తెలిపారు. బాలుడికి మెరుగైన వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకున్నామని వివరించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు.

రోగులు మెచ్చేలా సేవలందించండి

వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



కడియం ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

కడియం: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్య సిబ్బందికి వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ పచ్చదనం మరియు సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఆయన సందర్శించారు. ఇటీవల ఆసుపత్రిపై పలు ఫిర్యాదులు రావడంతో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వీటిపై నిజ నిర్ధారణకు కమిటీ వేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరిగితే తీవ్ర చర్యలు తీసుకోవాలన్నారు. పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, సిబ్బంది పారదర్శకంగా ప్రజలకు అందించాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల పార్టీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్, నాయకులు సాకా పట్టాభి, సుధాకర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దొడ్డ బుజ్జి, గణేష్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

వేమగిరి సహకార సొసైటీ చైర్మన్ వెలుగుబంటి అచ్యుతరామ్ ఆయన నివాసం వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. దీనిని చందన నాగేశ్వర్ సందర్శించి ఆయన చేతుల మీదుగా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. చందన మాట్లాడుతూ అచ్యుతరామ్ సేవలను కొనియాడారు. నాయకులు బడుగు ప్రశాంత్‌కుమార్, విప్పర్తి ఫణి, కాగిత రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



కడియంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. గురువారం కడియం అరుంధతీపేట, రామాలయం ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. సంక్షేమ పథకాలు రానివారిని గుర్తించి, ఎందుకు రావడం లేదో ఆరా తీశారు. సంబంధిత వలంటీర్ ద్వారా ఆయా పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని చందన ఆదేశించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల పార్టీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొడ్డా బుజ్జి, శివాలయం కమిటీ చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇటీవల గుండె సంబంధిత శస్త్రచికిత్స అనంతరం కోఆప్షన్ మాజీ సభ్యుడు సర్కార్ బాషా తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ని చందన నాగేశ్వర్ పరామర్శించారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతికి సీఎం జగన్ అన్ని విధాలా సహకరిస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కొంతమూరులోని మస్జిద్ ఏకొసర్‌లో గురువారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని, ఇఫ్తార్ విందులు సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు. ముస్లింలకు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు ఎంఎం ఆలీ, మాజీ ఉప సర్పంచ్ షేక్‌మౌలాలి, షేక్‌చానా, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, పడాల ప్రసాద్, చెరుకూరి సత్యనారాయణ, బాజీ, పింటూ తదితరులు పాల్గొన్నారు.

పలకరిస్తూ.. భరోసా కల్పిస్తూ..

రచ్చబండలో సమస్యలు పరిష్కరించిన ఎంపీ భరత్‌రామ్



రచ్చబండలో సమస్యలు వింటున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో గురువారం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో 'రచ్చబండ' కార్యక్రమం నిర్వహించారు. పలువురు మాతృమూర్తులు కన్నీటి పర్యంతం అవుతూ తమ గుండెల్లోని ఆవేదనను ఆయనకు మొరపెట్టుకున్నారు. ఎంపీ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ.. కొండంత ధైర్యాన్ని ఇవ్వడంతో ఆ మాతృమూర్తుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. తన కుమారుడికి ఏడాది కిందటే వివాహమైందని, పది నెలలుగా కనిపించడం లేదని జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ మహిళ వివరించింది. తుని దగ్గర శరభవరం సమీపంలో కాలువ వద్ద తమ అబ్బాయి సెల్, బైక్ కనిపించాయని తుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆమె రోదించింది. ఆమెను ఎంపీ ఓదార్చి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నిడదవోలుకు చెందిన ఓ ఆర్మీ పోలీసు కుమారుడితో తమ కుమార్తెకు వివాహం చేస్తే.. కాపురం చేయనని అంటున్నాడని స్థానిక ఆవ రోడ్డు వాంబే కాలనీకి చెందిన ఓ మాతృమూర్తి ఎంపీ వద్ద బోరున విలపించింది. రాజమహేంద్రవరం దిశ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ తల్లి తెలిపింది. వెంటనే సీఐకు ఫోన్ చేసి ఈ కేసును సీరియస్‌గా తీసుకోమని ఎంపీ భరత్‌రామ్ సూచించారు. స్థానిక అన్నపూర్ణమ్మ పేటలో నాయీ బ్రాహ్మణ సేవా సంస్థ కమ్యూనిటీ హాల్ ఉంది. దానికి ఉన్నపళంగా రూ.30 వేల పన్ను వేసే సరికి ఎంపీని నిర్వాహకులు ఆశ్రయించారు. నగర పాలక సంస్థ ఏడీసీతో ఎంపీ మాట్లాడి గతంలో మాదిరిగానే పన్ను కట్టించుకోమని సూచించారు. ఇలా ఎన్నో సమస్యలను లిఖితపూర్వకంగా ఎంపీకి అందజేశారు. వాటిని ఒకవైపు చదువుతూనే.. మరోవైపు బాధితుల సమస్యలను ఎంతో ఆసక్తిగా వింటూ.. సాధ్యమైనంత వరకూ అక్కడికక్కడే పరిష్కరించారు. కొన్నింటిని సంబంధిత అధికారుల దృష్టికి పరిశీలన నిమిత్తం పంపారు.

చోరీ నిందితుడి అరెస్ట్

ఉండ్రాజవరం : పెరవలి, ఉండ్రాజవరం మండల్లాలో మోటార్ సైకిళ్లను దొంగిలించిన నిందితుడిని అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.3 లక్షల విలువ చేసే నాలుగు మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రామారావు గురువారం తెలిపారు. గతంలో మండలంలో వేలివెన్ను, తాడిపర్రు, పెరవలి మండలం తీపర్రు గ్రామాల పరిధిలో నాలుగు మోటార్ సైకిళ్ల దొంగతనానికి గురైనట్లు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో రెండు టీంలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలించినట్లు తెలిపారు. గురువారం వేలివెన్ను గ్రామానికి చెందిన లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దొంగను పట్టుకోవడానికి సహకరించిన ఎస్సై రామారావు, ఏఎస్సై కె.రామకృష్ణ టీంలను డీఎస్పీ అభినందించారు.

ప్రజల నమ్మకాన్ని కాపాడుకుందాం..

- సమస్యలను పరిష్కరిద్దాం
- డివిజన్ ఇన్‌చార్జులతో ఎంపీ భరత్‌రామ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి వార్డులో ప్రజల సమస్యలు నిశితంగా పరిశీలించి వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గురువారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని రాజమహేంద్రవరం పార్లమెంట్ కార్యాలయంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం, చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై స్థానిక 22, 23, 38, 39 వార్డుల బాధ్యులతో ఎంపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మనపైనా, మన నాయకుడు సీఎం జగన్‌పై పూర్తి విశ్వాసం, అభిమానం ఉందన్నారు. వాటిని పదిలంగా కాపాడుకుందామని తెలిపారు. ఆయా వార్డులలో నివాసితులు ఏమేమి కావాలని అనుకుంటున్నారు.. మనం ఎంత వరకూ చేయగలిగాం.. ఇంకా చేయాల్సిన పనులు.. చేపట్టిన పనులు ఏ మేరకు పురోగతిలో ఉన్నాయి.. ఇవన్నీ చూసుకోవాల్సింది మీరేనని అన్నారు. ఏ విషయంలోనూ నిర్లక్ష్యంగా ఉండవద్దని చెప్పారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం అన్ని వార్డుల్లో విజయవంతం అయ్యిందని అన్నారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలపై, జగనన్న పాలనపై పూర్తి సంతృప్తిని అన్ని వార్డుల్లో ప్రజలు వ్యక్తం చేశారన్నారు. ప్రజలు జగనన్నపై చూపిస్తున్న నమ్మకాన్ని పదింతలు చేయడమే ఇప్పుడు మనం చేయాల్సిన అసలైన కార్యక్రమమని ఎంపీ తెలిపారు. నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆయా వార్డుల ఇన్‌చార్జులు దూర్వాసుల సత్యనారాయణ, వాకచర్ల కృష్ణ, అరిగెల బాబు, లంకా ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి కొత్తా విజయ రాజ్యలక్ష్మి, ఆయా వార్డుల నాయకులు కొత్తా బాలమురళి, రామసాయి దీపు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత నాదే..

రాజమహేంద్రవరం సిటీ: అర్హులందరికీ ఇళ్ల పట్టాలిచ్చి గృహ ప్రవేశమయ్యే వరకూ పూర్తి బాధ్యత తను తానే తీసుకుంటానని ఎంపీ భరత్‌రామ్ ప్రజలకు హామీ ఇచ్చారు. స్థానిక 46వ డివిజన్ క్వారీ మార్కెట్ సెంటర్ ఆనంద్‌నగర్ దుర్గమ్మ ఆలయం నుంచి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళను పరామర్శించి ఆమెకు ఆరు నెలలకు సరిపడా మందులు ఇవ్వాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అలాగే సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. పలువురు ఇళ్ల పట్టాల సమస్యను ఎంపీ దృష్టికి తీసుకురాగా మీకు ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. ఆనంద్‌నగర్‌కు చెందిన ఓ వృద్ధురాలికి పింఛన్ మంజూరు కాలేదని తెలుసుకున్న ఎంపీ స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి మాట్లాడారు. మూడు నెలల్లో పెన్షన్ వచ్చేలా చూస్తానన్నారు. అప్పటి వరకూ నెలకు రూ.1500 ఇస్తానని అన్నారు. నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఎంఎస్ఓ ప్రభాకర్, ఎంహెచ్ఓ వినూత్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మామిడి సత్యసాయిపవన్ (30) మృతి చెందాడు. కోరుకొండ ఎస్సై కట్టా శారదా సతీష్ కథనం ప్రకారం.. గోకవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన పవన్ మరో యువకుడితో కలసి అతని బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తన ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసి.. ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. బైక్ నడుపుతున్న పవన్ రోడ్డుకు ఎడమవైపున పడడంతో లారీ అతని మీద నుంచి ఎక్కేసింది. దీంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

గోదావరి స్నానాల రేవు చదును



తాళ్లపూడిలోని గోదావరి స్నానాల రేవును శుభ్రం చేసిన దృశ్యం

తాళ్లపూడి: ఆర్ఎస్ఎస్ సభ్యుల ఆధ్వర్యంలో తాళ్లపూడిలోని గోదావరి పుష్కరాల రేవును గురువారం శుభ్రం చేశారు. ఇక్కడ స్నానాలు చేసేందుకు వీలు రేవులో అస్తవ్యస్తంగా ఉన్న రాళ్లను, మట్టి దిబ్బలను తొలగించి చదును చేశారు. ఈ పనులన్నీ బొర్రా శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. అధికారులు కూడా స్పందించి మరింత అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలబడదాం..

ఉండ్రాజవరం: లబ్ధిదారుల సొంతింటి కలను నిజం చేస్తున్న సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. పాలంగి గ్రామంలో జగనన్న కాలనీని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు అనుకూలంగా జగనన్న కాలనీ లేఅవుట్‌ను మట్టితో మెరక చేయించి, వారికి కేటాయించిన స్థలాలకు నెంబరింగ్ వేయించి అప్పగించామన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అన్ని రకాల సహాయ అందిస్తోందన్నారు. లబ్ధిదారులు త్వరగా తమ ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, పాలాటి శరత్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, కఠారి సిద్ధార్థరాజు, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, తహసీల్దార్ జి.కనకరాజు, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు, హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు, విద్యుత్ ఏఈ దొరబాబు పాల్గొన్నారు.

చిక్కీల తయారీ కేంద్రాల పరిశీలన



కొంతమూరులో స్వీట్స్ తయారీ విధానాన్ని తెలుసుకుంటున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

రాజమహేంద్రవరం రూరల్: మహిళల స్వయం ఉపాధికి కొంతమూరులో ఏర్పాటు చేసుకున్న చిక్కీలు, స్వీట్స్, పచ్చళ్ల తయారీ కేంద్రాలను సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ పరిశీలించారు. చిక్కీల తయారీపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్వీట్స్, హాట్ తయారీ గురించి నిర్వాహకురాలు మాధవిని అడిగారు. యాంత్రీకరణ ద్వారా చేపడితే ప్రభుత్వం మరింత సహకారం అందిస్తుందన్నారు. మరింత వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం నుంచి సాయం అందించాలని మాధవి సీఈఓను కోరింది. డీఆర్‌డీఏ-వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి, డీపీఎం సంపత్‌కుమార్, ఏపీఎం మహేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

స్థల వివాదాన్ని పరిష్కరిస్తాం..

సీటీఆర్ఐ: ఇరువర్గాలు చెప్పిన వివరాలను సేకరించామని, స్థల వివాదాన్ని పరిష్కరిస్తామని సెర్ప్ ముఖ్య కార్యదర్శి నిర్వహణ అధికారి ఎండీ ఇంతియాజ్ అన్నారు. స్థానిక సుబ్బారావు నగర్‌లో స్థల వివాదం పరిష్కారానికి సంబంధించి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ అధికారిగా ఇంతియాజ్ గురువారం నగరానికి వచ్చారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న ఇంతియాజ్‌ను జేసీ ఎస్.తేజ్ భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విచారణ నిమిత్తం సుబ్బారావు నగర్‌లోని వివాద స్థల ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ వివరాలు తీసుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

మద్యపానంతో అనర్థాలు



పురుషోత్తపట్నం సచివాలయంలో మాట్లాడుతున్న ఎస్సై శుభశేఖర్

సీతానగరం: మద్యం తాగడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, అలాగే కుటుంబ వ్యవస్థ ఆర్థికంగా పతనం అవుతుందని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. గురువారం పురుషోత్తపట్నం సచివాలయంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా వ్యాపారాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జూదాలు, కోడి పందేలు, గుండాటలు, సారా విక్రయాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని, పిల్లలతో వెట్టిచాకిరి చేయించరాదన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే సమాచారం అందించాలని ఎస్సై కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెలిచేటి మెహర్‌బాబా, శరత్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం అందేలా చూడాలి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



పెదపూడి పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెదపూడి: గ్రామాల్లో పోలీసింగ్‌ను మరింత మెరుగుపరిచి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పెదపూడి పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. శాంతి భద్రత చర్యలు, ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న మహిళా పోలీసుల సేవలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. వారి ద్వారా గ్రామాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుని క్రైమ్ రేటుని తగ్గించే విధంగా ఒక ప్రణాళికతో పోలీసింగ్‌ను మెరుగుపరచాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో బళ్లమ్మ అమ్మవారి తీర్థం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వాసు, ఏఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.